నరకానికి రహదారి


కానూరు శశి పాఠశాల వద్ద రోడ్డు దుస్థితి


కానూరు-ఉసులుమర్రు వద్ద ఏర్పడిన గొయ్యి

- అధ్వానంగా నిడదవోలు-నరసాపురం రోడ్డు
- గోతులతో వాహనదారుల అగచాట్లు
- గత 6 నెలల్లో 45 ప్రమాదాలు

పెరవలి: నిడదవోలు-నరసాపురం ఆర్‌అండ్‌బీ రహదారిలో ప్రయాణం అంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించవలసి వస్తుందని ప్రయాణికులు, వాహనచోదకులు వాపోతున్నారు. అడుగుకో గొయ్యి గజానికో నుయ్యి అన్న చందంగా గోతులు ఉండటంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో చిన్నపాటి గోతులు మాత్రమే ఉండేవని మరమ్మతుల పేరుతో రోడ్డును సగం తవ్వేసి వదిలేయడంతో నేడు అవి నూతుల్లా తయారవ్వటంతో ప్రయాణీకులు, గ్రామస్థులు భయాభ్రాంతులకు గురవ్వుతున్నారు. గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు కాల్వలను తలపించే విధంగా మారటంతో ప్రయాణీకులు పడే పాట్లు వర్ణనాతీతంగా మారాయి. వర్షాలు కురిస్తే బురద రోడ్డుగా, ఎండ కాస్తే రోడ్డే కనిపించనంత దుమ్ము ధూళి ఎగిరి వాహనదారుల కళ్లల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు.

నిమ్మకు నీరెత్తినట్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదట గోతులు పూడ్చి, రాకపోకలకు అంతరాయం లేకుండా చేస్తామని, అనంతరం సంక్రాతికి రహదారిపై ఎటువంటి గోతులు ఉండవని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే అన్నారు. ఒకవేళ ఎక్కడైనా గోతులు ఉంటే స్థానిక ఎమ్మెల్యేదే తప్పు తప్ప ప్రభుత్వానిది కాదని, అప్పుడు మీరు మీ ఎమ్మెల్యేను నిలదీయవచ్చని చెప్పారు. కానీ దీనికి విరుద్ధంగా రోడ్డును పూర్తిగా తవ్వేసి వదలివేయటంతో కానూరు పీహెచ్‌సీ వైద్యుడు జారిపడి చేయి విరిగింది. ఇటువంటి ప్రమాదాలు నిత్యం జరుగుతూనే ఉన్నా ప్రజా ప్రతినిధులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తుతున్నారు.

ఆరు నెలల్లో 45 ప్రమాదాలు

రహదారిలో ఏర్పడిన గోతులతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రయాణికులు నానా పాట్లు పడుతున్నారు. ఎండకాచినప్పుడు రోడ్డు నుంచి లేచివచ్చే దుమ్ముతో పాటు వాహనాలు వెళ్లుతున్నప్పుడు రాళ్లు లేచి గాయాలు పాలవుతున్నారు. ముఖ్యంగా ఉసులుమర్రు, కానూరు గ్రామాల మధ్య పరిస్థితి మరింత అధ్వానంగా తయ్యారయ్యింది. గత ఆరు నెలల్లో 45 ప్రమాదాలు జరగగా 17 మంది క్షతగాత్రులుగా మారగా వీరిలో ముగ్గురు మహిళలు, 14 మంది పురుషులు ఉన్నారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే గోతులను పూడ్చి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.


తీపర్రు వద్ద

పట్టించుకునే నాథుడే లేడు



కానూరు నుంచి ఉసులుమర్రు వరకు రోడ్డు అధ్వానంగా తయారయ్యింది. గోతుల కారణంగా ఎటువెళ్లాలో తెలియక గోతుల్లో పడి గాయాల పాలవ్వుతున్నాం. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోనే నాథుడే లేరు.

దొడ్డిగర్ల బాలకృష్ణ, వాహనదారుడు, పెరవలి

వాహనాల మరమ్మతులతో ఇక్కట్లు



వర్షాలతో రోడ్డు పూర్తిగా పాడైపోయింది. ఒక గోతిని తప్పించపోయి మరో గొయ్యిలో పడుతున్నాం. దీని వలన వాహనాలు పాడై ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు వెంటనే మేల్కొని మరమ్మతులు చేపట్టాలి.

డి.నాగరాజు ప్రయాణికుడు, కొత్తపల్లి అగ్రహారం

ఏటిగట్టు భద్రంగానే ఉంది


కాకరపర్రులో ఏటిగట్టును పరిశీలిస్తున్న తహసీల్దార్, అధికారులు

పెరవలి: ఎగువ ప్రాంతాల్లో కురుస్తోన్న భారీ వర్షాల కారణంగా గోదావరికి వరద పెరగటంతో గురువారం రాత్రికి రెండో ప్రమాదహెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నందున ఏటిగట్లు పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తహసీల్దార్ కె.నిరంజన్ తెలిపారు. మండలంలో కానూరు నుంచి మల్లేశ్వరం వరకు ఏటిగట్టును గురువారం గోదావరి కన్జర్వెన్సీ అధికారులతో కలసి పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఏటిగట్టు పలుచోట్ల కోతకు గురైయ్యిందన్నారు. ఆయా ప్రాంతాల్లో ఇసుక బస్తాలు సిద్ధం చేసి గట్టును పటిష్ట పరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వరద మరింత పెరిగినా గట్టుకి ఎటువంటి ఇబ్బంది లేదని ఆయన పేర్కొన్నారు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఎవరు దిగవద్దని లంకల్లో ఉండే పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. శుక్రవారం నుంచి రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది ఏటిగట్టుపై పహారా కాస్తారని వెల్లడించారు.

ముంపు ప్రాంతాల్లో వైద్య శిబిరాల ఏర్పాటు


పందలపర్రులో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

నిడదవోలు రూరల్: గోదావరి ముంపు గ్రామాల్లో సీజనల్ వ్యాధుల ముందస్తు నివారణకు ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు మేరకు సమిశ్రగూడెం, పీహెచ్‌సీల పరిధిలో పందలపర్రు, విజ్జేశ్వరం, తాళ్లపాలెం, శెట్టిపేట, రావిమెట్ల గ్రామాల్లో గురువారం వైద్యశిబిరాలు నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్నవారికి రక్తపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.శివాజీ, ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

తాళ్లపూడి: వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీలు ముందుగా అనుమతి తీసుకోవాలని తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ గురువారం ఆదేశించారు. పర్యావరణానికి హని కలగని మట్టి విగ్రహాలకు ప్రాధాన్యతనిస్తూ, ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ఉత్సావాలను నిర్వహించుకోవాలన్నారు. మండపాలు ఏర్పాటు చేసే వారు ముందుగా స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. ఉత్సవాలు ఎన్ని రోజులు నిర్వహిస్తారు, నిమజ్జనం తేదీ తదితర వివరాలను తెలియజేయాలన్నారు. పబ్లిక్, ప్రైవేట్ స్థలాల్లో మండపాలు ఏర్పాటుకై అనుమతులు తప్పనిసరన్నారు. మండపాల నిర్వాహకులు ఈ వెబ్సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో ఆన్ లైన్‌లో అనుమతులు పొందవచ్చునన్నారు. ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. దరఖాస్తు అనంతరం సంబంధిత పోలీస్ అధికారి మండప స్థలాన్ని తనిఖీ చేసి, నిబంధనల ప్రకారం ఉంటే నిరభ్యంతర పత్రాన్ని జారీ చేస్తారని వివరించారు.

ఫేస్ క్యాప్చర్‌ను రద్దుచేయాలి

నిడదవోలు (ఉండ్రాజవరం): లబ్ధిదారుల ఫేస్ క్యాప్చర్‌ను రద్దుచేసి సంతకాలతో స్టాకు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉండ్రాజవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు తాడిపర్రు సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారించాలని కోరుతూ నల్ల చీరలు ధరించి విధులకు హాజరయ్యారు. జీతాలు పెంచాలని, రికార్డు పుస్తకాలను పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు జువ్వల రాంబాబు, ఎస్.రంగనాయకి, కె.లక్ష్మి, గిరిజ, రామలక్ష్మి, లక్ష్మీ కుమారి మండల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విమర్శించే స్థాయి జనసేనకు లేదు

- హామీలన్నీ గాలికి వదిలేసిన కూటమి
- బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
- మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే


హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు


మండల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ నాయుడు

పెరవలి: ప్రజలకు సూపర్ సిక్స్‌తో సహా 140కి పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబుతో పాటు కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పిలుపునిచ్చారు. పెరవలి స్థానిక దీపికా కల్యాణ మండపంలో మండల పార్టీ అధ్యక్షుడు గండేపల్లి రామకృష్ణ అధ్యక్షతన బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ పెరవలి మండలస్థాయి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జి.శ్రీనివాస్‌నాయుడు పార్టీ నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికి రూ.లక్షల్లో నగదు వస్తుందని ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలన్ని అమలు చేశామని, పార్టీలకు, కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులకు లబ్ధిచేకూర్చామని ఆయన గుర్తుచేశారు. సూపర్ సిక్స్ పథకాలు పూర్తిగా అమలు చేయాలంటే ఏపీని అమ్మాల్సి వస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక్క పథకం పూర్తిగా అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని, చంద్రబాబు అబద్ధాల కోరని ధ్వజమెత్తారు. 2024లో ఈవీఎంలతో గెలిచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. నిడదవోలు అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో సహకరించారన్నారు.

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా

తన తండ్రి జీఎస్ రావు, తాను కార్యకర్తలకు ఎలప్పుడూ అందుబాటులో ఉంటామని, కూటమి పెడుతున్న అక్రమ కేసులకు ఎవరూ భయపడొద్దన్నారు. 2029లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని, ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉంటూ కూటమి ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గండేపల్లి రామకృష్ణ మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి జనసేన పార్టీ నేతలకు లేదని, నియోజకవర్గంలో గోతులు పడిన రోడ్లు ముందు పూడ్చాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైస్ ఎంపీపీలు వేండ్ర శ్రీనివాస్, మత్తాల ఉషారాణి, వైఎస్సార్ సిపి జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్టి రాంబాబు నాయకులు రవి, జన్ని వరలక్ష్మి వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పథకాలు వర్తింప జేయాలి


నల్లజర్లలో మానవ హారంగా ఏర్పడిన కార్యకర్తలు, హెల్పర్లు


వైఎస్సార్ జంక్షన్‌లో నల్ల చీరలతో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

నల్లజర్ల: ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్(సీఐటీయూ) పిలుపు మేరకు అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం నల్లజర్లలో అంగన్‌వాడీలు నల్లచీరలతో నిరసన చేపట్టారు. మండల పరిషత్ కార్యాయలం నుంచి నినాదాలు చేస్తూ ప్రధాన జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకురాలు శివకుమారి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సబ్బంది వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. వివిధ రకాల యాప్‌లతో సతమతమవుతున్నామని అన్నింటికి ఒకే యాప్ విధానం అమలు చేయాలని కోరారు. తల్లికి వందనం, వితంతు పెన్షన్, ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇతర సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలి కోరారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చే జీఓ విడుదల చేయాలన్నారు. రేషన్ కార్డులలో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించాలన్నారు. అంగన్‌వాడీలు ప్రేమవతి, మానుకొండ వాంతవల్లీ, బేబి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన అంగన్‌వాడీలు

పెరవలి: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తోన్న కారణంగా పెరవలిలో జాతీయ రహదారిపై గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు నల్ల చీరలతో రాస్తారాకో నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగుల్లా ఉదయం నుంచి సాయంత్రం వరకు పని చేస్తున్నా అందుకు తగిన వేతనం ఇవ్వటం లేదన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లను నేరవేర్చాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కె.కృష్ణవేణి, విశబూలి, బి.నాగవేణి, రామలక్ష్మి, వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలి

గోపాలపురం: ప్రభుత్వం ముఖ హాజరు వేయాలని షరతులు పెట్టడం సమంజసం కాదని వెంటనే విరమించుకోవాలంటూ గురువారం మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు నల్లచీరలు ధరించి వైఎస్సార్ జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ చైర్మన్ జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరంకుశ వైఖరి మార్చుకోవాలని అంగన్‌వాడీకు ముఖ హాజరు తీసివేయాలని కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ అధ్యక్షురాలు కె.రామలక్ష్మి, హేమలత సభ్యులు పాల్గొన్నారు.

అవకతవకలను నిగ్గుతేల్చాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీపీ, బాధితులు

గోపాలపురం: వాదాకుంట గ్రామానికి చెందిన కొడమంచిలి సోమయ్య కుమారుడు జర్మియా అనే వ్యక్తికి మిలటరీ కోటాలో మండలంలోని కరచర్లగూడెం సర్వే నంబర్ 150లో అయిదు ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. అతనికి నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సదరు కుటుంబ సభ్యులకు తెలియకుండా వీరిలో కొడమంచిలి రాజారత్నం కుమారుడు విజయ్‌కుమార్, ప్రైవేటు వ్యక్తి, రెవెన్యూ అధికారులు సహకారంతో రికార్డులు తారుమారు చేసి సదరు భూమిని బయట వ్యక్తులకు విక్రయించారని భూమిని తమకు కేటాయించాలంటూ తహసీల్దార్ వద్ద బాధితులు వాపోయారు. న్యాయం చేస్తానని బాధిత సభ్యులకు తహసీల్దార్ హామీ ఇచ్చారు. బాధితుల వెంట ఎంపీపీ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలివేణు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నిడదవోలు: వార్షిక మరమ్మత్తుల నిమిత్తం నిడదవోలు పట్టణంలోని నందిన ఫీడర్, బ్రాహ్మణగూడెం, దారవరం, తిమ్మరాజుపాలెంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ఈఈ తెలిపారు. ఈ మేరకు పట్టణంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దేవి నగర్, ఎఫ్‌సీఐ గొడౌన్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పోలీస్ స్టేషన్ రోడ్డు, గాంధీ బొమ్మ సెంటర్, అన్నపూర్ణ నగర్, బసివిరెడ్డిపేట, రైల్వేగేట్, గణపతి సెంటర్, యర్నగూడెం రోడ్డు, శాంతినగర్, యాక్సిస్ బ్యాంక్, వైఎస్సార్ కాలనీ, జగనన్న కాలనీ, బాలాజీ నగర్, టక్కరిబాబా పేట, సంజీవయ్య నగర్, శశి స్కూల్ రోడ్డు, ఎస్టీ కాలనీ, బ్రాహ్మణగూడెం, దారవరం ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

నిడదవోలు రూరల్: వార్షిక మరమ్మతుల దృష్ట్యా కోరుమామిడి, బసివిరెడ్డిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు గురువారం తెలిపారు. ఈ మేరకు కోరుమామిడి, శెట్టిపేట, తాళ్లపాలెం, సమిశ్రగూడెం, అట్లపాడు గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గృహ, పరిశ్రమ, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పెరవలి: కానూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు కానూరు, నడుపల్లి, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు.

చాగల్లు: నిడదవోలు సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ పనులు నిర్వహిస్తున్నందున నేడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈఈ తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బ్రాహ్మణగూడెం, దారవరం గ్రామాలకు అంతరాయం ఉంటుందన్నారు.

11కేవీ అమ్మికుంట ఫీడర్ మెయింటెనెన్స్ పనుల కారణంగా ఫీడర్ పరిధిలో నేడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని, 3 ఫేజ్ సరఫరాను తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి చేస్తాం

నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లి పీఏసీఎస్‌ల త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా జుజ్జవరపు గోపాలకృష్ణ, సభ్యులుగా ఎస్.సూర్యప్రభాకరరావు, మారిశెట్టి శ్రీనివాస్‌లు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్ గోపాలకృష్ణ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. నాయకులు బూరుగుపల్లి శ్రీనివాస్, పోలిరెడ్డి వెంకటరత్నం, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పొగాకు గుబులు

- క్షీణిస్తున్న ధరలు
- రైతుల ఆందోళన


గోపాలపురం వేలం కేంద్రంలో సిద్ధంగా ఉన్న బేళ్లు

గోపాలపురం: అంతర్జాతీయ వాణిజ్య పంట వర్జీనియా పొగాకు ధరలు రోజు రోజుకూ తగ్గుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజులుగా కిలో పొగాకు రూ.20 చొప్పున ధరలు క్షీణించడం, లోగ్రేడ్ పొగాకు కిలో రూ.200 దాటకపోవడం, కేవలం (నాణ్యమైన) పొగాకును మాత్రమే కంపెనీలు కొనుగోలు చేయడంతో సరాసరి ధరలేక రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. గత ఏడాది కిలో ధర రూ.400 దాటినందుకు ఆనందపడి ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేశామన్నారు. దీంతో కనీసం పెట్టుబడులు వస్తాయో లేదో అన్న సందేహం రైతులను వెంటాడుతుంది.

ధరలు పెంచాలి



లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేయకపోవడం వల్ల ఈ ఏడాది తీవ్రంగా నష్టపోవాల్సి వస్తాది. ఇప్పటి వరకూ కిలో 200 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ధర పెరిగితే కానీ రైతులకు గిట్టుబాటు ధరరాదు. కంపెనీలు రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని లోగ్రేడ్ పొగాకు ధరలు పెంచాల్సిన అవసరం ఉంది.

ఆలపాటి రాజు, రైతు గోపాలపురం

క్లుప్తంగా

సేవారత్న అవార్డు ప్రదానం


ఆనంద్‌ను అవార్డుతో సత్కరిస్తున్న రంగస్థల కళాకారులు

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త వసంతాడ ఆనంద్ స్వరూప్‌కు తాడేపల్లిగూడెం రంగస్థల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉద్యోగ సేవా రత్న అవార్డుతో సత్కరించినట్టు ఆనంద్ స్వరూప్ తెలిపారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం తెగించి చేసిన సేవా కార్యక్రమాలు, కళాకారులకు సైతం ఆర్థికంగా సాయం చేసినందుకు ఈ అవార్డుకు ఆయనను ఎంపిక చేసినట్టు రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షుడు షేక్ నాగూర్ సాహెబ్ తెలిపారు. తమ 159 వ నెలవారీ సమావేశంలో ఈ అవార్డును ప్రదానం చేసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణ, వీనస్ ఆసుపత్రి వైద్యురాలు ఝాన్సీరాణి, రాపాక ఫణికిశోర్, జొన్నకూటి ప్రమోద్‌కుమార్, రాచర్ల అబ్బులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

చాగల్లు: మండల కేంద్రం చాగల్లులో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెలగ సంఘం ఆధ్వర్యంలో జరిగే 70వ వార్షికోత్సవ వేడుకలను ఈ ఏడాది ఘనంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ నిర్వాహకులు గండ్రోతు సురేంద్రకుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. జుట్టా ఏడుకొండలు, అనిశెట్టి సూర్యం, గండ్రోతు సూర్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్‌లో సత్తా చాటుతున్న బాలిక

గోపాలపురం: బాలికల అండర్-15 సెంట్రల్ క్రికెట్ జట్టుకు గోపాలపురం మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన యశశ్రీ ఎంపికైనట్లు ఆమె తండ్రి తానింకి సత్యనారాయణ గురువారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు సెంట్రల్ జోన్ నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన వెల్లడించారు. గతంలో బాలిక జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందన్నారు. బాలికను పెద్దాపురం, గోపాలపురం మండల క్రీడాకారులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మా కులం ఏమిటో చెప్పండి మహాప్రభో ..!


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న కుల నాయకులు

పెరవలి: దేశంలో బేడ, బుడగ జంగాలు ఉన్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించినట్లు ప్రకటనలు చేస్తున్నారే కానీ, మా కులం ఏమిటో చెప్పండి మహాప్రభో అంటూ బేడ, బుడగ జంగాల నాయకులు తహసీల్దార్ కె.నిరంజన్‌కు మొర పెట్టుకున్నారు. పెరవలి తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేసి, వినతిపత్రం అందించారు. జిల్లా ఉపాధ్యక్షుడు పేర్ల నాగు మాట్లాడుతూ పెరవలిలో 110 కుటుంబాలు జీవిస్తున్నామని కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మమ్మల్ని ఎస్సీలుగా గుర్తించి కేటగిరి -1లో చేర్చిందన్నారు. ఆన్‌లైన్‌లో తమ కులాలను తొలగించటంతో నేడు ధృవీకరణ పత్రాలు ఇవ్వటం లేదని, మా పిల్లల భవిష్యత్ ఏమిటో అర్థంకావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంగువ సుబ్రహ్మణ్యం, పేర్ల సత్యనారాయణ, గోటూరి కొండయ్య, టేకు పోసయ్య, నరసయ్య, నీరుకొండ కొండయ్య పాల్గొన్నారు.

బాణసంచా రవాణాపై కేసు నమోదు

చాగల్లు: అక్రమంగా బాణసంచా రవాణా చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్సై కె.నరేంద్రకుమార్ గురువారం తెలిపారు. బుధవారం రాత్రి చాగల్లు శివారులో ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా రవాణా చేస్తుండటంతో సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రూ.20వేలు విలువైన బాణసంచా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

పేకాట శిబిరంపై దాడి

మండలంలోని మీనానగరంలో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. వీరి నుంచి రూ.3,970 నగదు, పేకలు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు చెప్పారు.

8 మంది జూదరుల అరెస్ట్

గోపాలపురం: మండలంలోని రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడిచేసి 8మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు దేవరపల్లి ఎస్సై వి.సుబ్రహ్మణ్యం గురువారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పల్లంట్ల రోడ్డులో చెట్ల పొదల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా పేకాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,542 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.